అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 03 జులై 2023

సీఆర్టీల నియామక పరీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న సీఆర్టీల నియామకానికి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలికల, బాలుర ఆశ్రమ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను డీడీ మణెమ్మ పర్యవేక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయడం జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

వడదెబ్బతో రైతు మృతి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రుద్రపూర్ గ్రామానికి చెందిన గూర్లే శ్రీనివాస్(45) వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం పొలం పనులకు పత్తి విత్తనాలు నాటడానికి వెల్లాడు. తిరిగి ఇంటికొచ్చి సాయంత్రం నాలుగు గంటల సమయంలో పడుకున్నాడు. ఎంతసేపటికి లేవకపోవడంతో రాత్రి పది గంటల సమయంలో చూసేసరికి మృతి చెందినట్టు గుర్తించారు. మృతునికి భార్య ఒక కుమారుడు ఇద్దరు కూతుర్లు ఉన్నట్టు తెలిపారు.

కురవని మేఘం..అన్నదాత ఆగం..!

మేఘాలు కదలాడటం లేదు..వర్షం రావడం లేదు..భూమిలో వేసిన విత్తనం మొలకెత్తి ఆయువు కోసం ఆశగా ఎదురుచూస్తోంది. కానీ వర్షం మాత్రం రావడం లేదు. నీళ్లు లభించక మొలకెత్తిన పత్తి అలాగే వాడిపోయే పరిస్థితి వచ్చింది. ఐదు రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. కొన్ని చోట్ల వేసిన విత్తనాలు భూమిలోనే ఉండిపోవడంతో అవి మొలకెత్తడం కష్టంగా మారింది. సకాలంలో వర్షాలు రాక వానకాలం సాగు ఆలస్యమైందని ఆందోళన చెందుతున్న అన్నదాతలకు తాజా పరిస్థితి మరింత అవస్థలకు గురిచేస్తోంది. ప్రకృతిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల దుస్థితి వర్ణనాతీతంగా మారింది. మొలకదశలో ఉన్న పత్తిని కాపాడుకునేందుకు కొందరు రైతులు డబ్బాలతో నీళ్లుపట్టిస్తుండగా..మరికొందరు స్ప్రింకర్లతో నీటిని అందిస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

- ఐదు రోజులుగా ముఖం చాటేసిన వర్షం
- మొలక దశలోనే వాడిపోతున్న పత్తి పంట
- కృత్రిమంగా నీళ్లు పట్టిస్తున్న కర్షకులు
- పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఏటా మృగశిరకార్తె ముగియగానే కురవాల్సిన వర్షాలు ..ఆలస్యంగా వచ్చాయి. ఐదు రోజుల క్రితం రెండు రోజుల పాటు ఏకదాటిగా కురవడంతో రైతులంతా విత్తనాలు వేశారు. ఉమ్మడి జిల్లాలో 16.80లక్షల ఎకరాలకు గాను 11లక్షల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు పక్షం రోజులు పాటు వర్షాలు కురవకపోవడం..అక్కడక్కడ కురిసిన చిన్నపాటి వర్షానికి రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందిన రైతులకు వారం రోజుల క్రితం కురిసిన వర్షం ఆనందాన్ని తీసుకొచ్చింది. ఆ రెండు రోజుల పాటు వానలకు దాదాపు 90శాతం రైతులు విత్తనాలు నాటారు. కానీ మరుసటి రోజు నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తడి నేలలో వేసిన విత్తనాలు కావడంతో ప్రస్తుతం అవి మొలకెత్తి ఆయువు కోసం ఎదురుచూస్తున్నాయి. వారం రోజుల క్రితం ఈ ఏడాది 158మి.మి వర్షం కురవాల్సి ఉండగా కేవలం 45మి.మి మాత్రమే కురిసింది. దీంతో సుమారు 100మి.మి లోటు వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు రాకపోతే పత్తి మొలకలు పూర్తిగా వాడిపోయే ప్రమాదం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంరక్షణ కోసం తంటాలు..!

గత ఐదు రోజులుగా వర్షాలు రాకపోవడం.. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. వేసిన విత్తనాలు మొలకెత్తి వర్షం కోసం ఎదురుచూస్తుండటంతో వాటిని కాపాడుకోవడం కర్షకులకు పెద్ద సవాల్‌గా మారుతోంది. చిన్నసన్నకారు రైతులు మొలకెత్తిన మొలకలకు డబ్బాలతో నీళ్ల చల్లుతూ సంరక్షించే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు రైతులు ప్రత్యేకించి కూలీలను పెట్టి మరీ మొలకలకు నీళ్ల పట్టిస్తున్నారు. ఇంకొందరు రైతులు స్ప్రింకర్ల ద్వారా ఆయువు పోస్తూ రక్షించుకుంటున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వేసవిని తలపిస్తుండటంతో ఒకటి, రెండు రోజుల్లో వర్షాలు వస్తాయా రావా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వర్షం రాకపోతే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.కోట్లలో నష్టం వాటిల్లనుంది.

వర్షం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాం



-సింగంసెట్టి రాజు, కాప్సి, బేల

వారం రోజుల క్రితం వర్షం కురవడంతో 12 ఎకరాల్లో పత్తి పంట వేశాను. తడి నేల ఉండటంతో ప్రస్తుతం మొలకెత్తాయి. కానీ గత ఐదు రోజుల నుంచి వర్షం రాకపోవడంతో ఎండిపోయే దశకు చేరుకున్నాయి. మరో రెండు రోజులు వర్షం రాకపోతే మొలకలు వాడిపోయే పరిస్థితి ఉంది. వర్షం రాకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

ఏజెన్సీలోని గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలని గిరిజననేతరుల సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఫయాజ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు అనిల్ మోతే రావు, గిరిజనేతరుల సంఘం జిల్లా నాయకులు షేక్ దస్తగీర్, జాకిర్ ఉల్లఖాన్‌లు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చి రైతు బంధు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతులు దాదాపు 5 దశాబ్దాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికీ ఈరోజు వరకు హక్కు పత్రం లేకపోవడం బ్యాంకు రుణాలు సదుపాయం, రైతు బంధు లేకపోవడం వల్ల గిరిజనేతర రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించాలని 2018 సంవత్సరంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా ఏజెన్సీలోని గిరిజనేతర రైతుల సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపడతామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటివరకు గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గిరిజనేతర రైతుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియమించకపోవడంతో ఉర్దూ మీడియం విద్యాభ్యాసించే పిల్లలు విద్యకు దూరం అవుతున్నారని ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల పాఠశాలలు మూతపడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో వీవీలను నియమించి పాఠశాలలు కొనసాగే విధంగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనేతరుల సంఘం నాయకులు సిద్ధార్థ్ కొట్టంబే , గాయక్వాడ్ మారుతి, కిషన్ మోరే, డి మొరాజీ, భీమ శంకర్ కాంబ్లే, హకిం అన్సారీ పాల్గొన్నారు.

చిన్న రాస్పెల్లిలో వ్యక్తి దారుణ హత్య

- భార్య, కూతురే హత్య చేసినట్టు అనుమానం
- పరారీలో నిందితులు



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని చిన్న రాస్పెల్లి గ్రామానికి చెందిన ఎలుములె పుల్లయ్య(43) దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం ఎలుములె పుల్లయ్య మద్యం తాగి తరుచూ భార్యతో గొడవపడేవాడు. ఇదే క్రమంలో శనివారం మధ్యాహ్నం కూడా మద్యం సేవించి భార్య మంగతో గొడవ పడ్డాడని పేర్కొన్నారు. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు పుల్లయ్య, భార్య మంగ, కూతురు తేజారాణి కనపడకపోవడంతో పుల్లయ్య ఇంటి వెనకాల ఉండే అతని అన్నయ్య హనుమంతుకు అనుమానం వచ్చి ఆదివారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా పుల్లయ్య రక్తపు మడుగులో ఉన్నాడని పేర్కొన్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రక్తపు మడుగులో పడి పుల్లయ్య మృతిచెంది ఉండడంతో పాటు అతనిపై కారంపొడి చల్లి ఉండడం, చంపడానికి ఉపయోగించిన పదునైన ఆయుధం సైతం ప్రక్కనే ఉండడంతో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కాగా మృతుడి భార్య, కూతురు పరారీలో ఉండడంతో వారిద్దరే హత్య చేసి పారిపోయినట్టు అనుమానం బలపడుతుంది. మృతుడి అన్న హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. త్వరలోనే విచారణ చేపట్టి పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

నూతన సీఐకి ఎమ్మార్పీఎస్ నాయకుల సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన జువ్వాజి సురేష్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని వారు కోరారు. దళితులపై జరిగే దాడుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి జాతీయ ఉపాధ్యక్షులు రేగుంట కేశవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ రేగుంట మహేష్, మండల నాయకుడు దుర్గం వెంకట్ పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీ గనిలో జీఆర్ఎస్ క్యాంపు వద్ద ఆదివారం ఓబీ కార్మికులకు జీఎం సేఫ్టీ(కార్పొరేట్) గురువయ్య, జీఎం సేఫ్టీ రీజియన్ కెహెచ్ఎన్ గుప్తా, బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్, జీఎం సేఫ్టీ రీజియన్(ఆర్ఈ) ఎస్ సాంబయ్య, జీఎం ఎస్ఆర్పీ జి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నా భద్రత నా బాధ్యత-నా భద్రతే నా కుటుంబ భద్రత, సురక్షితమైన పని విధానాలు, పద్ధతుల అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జీఎం సేఫ్టీ(కార్పొరేట్) గురువయ్య మాట్లాడుతూ సింగరేణిలో ఎక్కువ ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, ప్రమాదాలను తగ్గించడానికి రక్షణ సంస్కృతిని పెంచాలని, అందులో భాగంగా ప్రతి ఒక ఉద్యోగి పని స్థలాల్లో రక్షణ పరికరాలను ధరించాలని, పై అధికారులు, సూపర్‌వైజర్ల రక్షణ సూత్రాలను పాటించి విధులు నిర్వర్తించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ తిరుమలరావు, ఎస్ఓటు జీఎం డీపీఏ ఉమాకాంత్, ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ, మేనేజర్ ప్రవీన్ పాంటింగ్, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, ఇన్‌ఛార్జి ప్రాజెక్టు ఇంజనీర్ నరేష్, బీఆర్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ నాయుడు, డీవైపీఎం వేణు, ఇంజనీర్ సురేష్ పాల్గొన్నారు.

కాజీపేట-బల్లార్షా సెక్షన్‌ల మధ్య పలు రైళ్లు రద్దు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాజీపేట-బల్లార్షా సెక్షన్‌ల మధ్య సోమవారం నుండి పలు రైళ్లను రద్దు చేస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సిర్పూరు(టి) నుండి కరీంనగర్ (నెం.07766) వెళ్లే మెము ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 3 నుండి 9 వరకు, కరీంనగర్ నుండి సిర్పూరు (టి) (నెం. 07765) వెళ్లే మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 4 నుండి 10 వరకు, కాజీపేట నుండి సిర్పూరు(టి) వెళ్లే (నెం. 17003) రామగిరి మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 3 నుండి 9 వరకు, బల్లార్షా నుండి కాజీపేట (నెం. 17004) వెళ్లే రామగిరి మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 3 నుండి 9 వరకు, భద్రాచలంరోడ్ నుండి బల్లార్షా (నెం. 17033) వెళ్లే సింగరేణి మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 3 నుండి 9 వరకు, సిర్పూరు (టి) నుండి భద్రాచలంరోడ్ (నెం. 17034) వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 3 నుండి 9 వరకు, కాజీపేట నుండి బల్లార్షా (నెం. 17035) వెళ్లే బల్లార్షా ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 3 నుండి 9 వరకు, బల్లార్షా నుండి కాజీపేట వెళ్లే (నెం. 17036) కాజీపేట ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 4 నుండి 10 వరకు రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ లైన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా లయన్ ఉబైద్ బిన్ యాహియ(తారిక్), సెక్రెటరీ పుల్లూరి శంకర్, కోశాధికారిగా సిహెచ్. సంజయ్ కుమార్, మొదటి ఉపాధ్యక్షుడుగా లయన్ వేణుగోపాల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తతం చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, మైక్రో కేబినెట్ మెంబర్ లయన్ పీచు వెంకట్ రమణరెడ్డి, చివుటి సుదర్శన్, జెడ్.సి. కోట వెంకన్న, జిల్లా చైర్మన్ నాంపల్లి శంకర్, ఇర్కుల ఆంజనేయులు పాల్గొన్నారు.

రాంపూర్ కార్యదర్శిపై అట్రసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రాంపూర్ గ్రామ కర్యదర్శి వెంకట్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రసిటీ కేసు నమోదు చేసినట్టు లక్షెట్టిపేట్ సీఐ తెలిపారు. గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పండుగ సందర్భంగా ఆ గ్రామ కార్యదర్శి వెంకట్, ఆ మాదిగ కులానికి చెందిన వారిని సంబరాల్లో డప్పు కొట్టాలని ఆదేశించారు. వారు స్పందించకపోవడంతో, ఒరేయ్ మాదిగ నా కొడకల్లారా, మీరు డప్పు కొట్టాలి కానీ ఇలా చేయడం సరికాదని వారిని కులం పేరుతో దూషించారు. ఆ గ్రామ మాదిగ కులస్తులు ఆదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు గ్రామ కార్యదర్శి వెంకట్‌పై ఆదివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రాపల్లెలో గుప్తనిధుల తవ్వాకాలు

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని రాపల్లిలో గుప్తనిధుల తవ్వకాలు జరుగుతున్నాయని ఆ గ్రామ వీఆర్ఏ ఫిర్యాదు చేసినట్టు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాపల్లి ముంపు గ్రామంలో శనివారం రాత్రి కొందరు వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్టు, జేసీబీతో తవ్వకాలు జరిపే క్రమంలో వీఆర్ఏ సత్యం గుర్తించి సమాచారం ఇచ్చారని జేసీబీని సీజ్ చేసి, అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

నేడు పోడు భూముల పట్టాల పంపిణీ

నవతెలంగాణ-రెబ్బెన

సోమవారం ఉదయం 10 గంటలకు మండలకేంద్రంలోని రైతు వేదికలో పోడు భూములకు పట్టా పాస్ పుస్తకాల పంపిణీ ఉంటుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని పోడు భూముల రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

జడ్పీ కోఆప్షన్ సభ్యునికి సతీవియోగం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని చింతగూడ శివారు రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలోని పాడుపడ్డ బావిలో వివాహిత మృతదేహం లభ్యమైంది. ఏఎస్సై మాను, హెడ్ కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సిద్ధిక్ భార్య షాబాజ్ (40)కు మతిస్థిమితం లేకపోవడంతో గత మే15న అదృశ్యమైంది. మృతురాలు కుమారుడు సోహెల్ ఇచ్చిన ఫిర్యాదు మే 19న మ్యాన్ మిస్సింగ్ కింద కేసు నమోదు చేశారు. ఆదివారం చింతగూడ శివారులోని పాడుపడిన బావిలో శవమై ఆచూకీ లభించింది. ఈ స్థలంకు వెళ్లిన ఓ పశువుల కాపరికి బావిలోని శవం కన్పించడంతో కాపువాడ కౌన్సిలర్ పీర్సింగుల జయచందర్‌కు సమాచారం అందించారు. రూరల్ పోలీసులకు సదరు వార్డు కౌన్సిలర్ సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఒంటిపై ఉన్న దుస్తుల ఆధారంగా షాబాజ్‌గా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పలువురి పరామర్శ

చింతగూడ గ్రామానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సిద్ధిక్ భార్య మృతి చెందడంతో మండల కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ ఖాన్, నాయకులు కోనేరు ఫణిందర్, పిర్సింగుల జయచందర్, మదన్ కుమార్ సంఘటన వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

మున్నూరు కాపు మహిళా విభాగం కన్వీనర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్నూరు కాపు మహిళా విభాగ నూతన కన్వీనర్‌గా ఎంపికైన గోలేటికి చెందిన కుందరపు శంకరమ్మను ఆదివారం జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి తన క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపులకు సంబంధించిన పలు అంశాలు జిల్లా పరిషత్ చైర్పర్సన్ దృష్టికి తీసుకురాగా పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేముల సంతోష్, సర్పంచ్ సోమశేఖర్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-బోథ్

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ వైద్య ఖర్చుల కోసం తెలంగాణ ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి 60 శాతం అందిస్తుందనీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఇటీవల మరణించిన తెలంగాణ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మెన్ సాయిచంద్‌కి 2 నిమిషాలు మౌనం పాటించి, నివాళులర్పించారు. బోథ్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు రూ.5లక్షల 39వేలు అందజేశారు. కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షలు ఇన్సూరెన్స్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, బోథ్ ఎఎంసీ చైర్మెన్ రుక్మాన్‌సింగ్, వైస్ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి, తలమడుగు మండల కన్వీనర్‌లు వెంకటేష్, రాజారాం, నాగయ్య, మాజీ ఎఎంసీ చైర్మెన్ భోజన్న, సర్పంచ్‌లు సురేందర్, మెహరాజ్ ఆయా మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగౌడ్‌కు ఘన నివాళ్లు

నవతెలంగాణ-నిర్మల్

బీఎల్ఎఫ్ మాజీ జిల్లా కన్వీనర్, బీసీ సంఘం జిల్లా నాయకులు రామాగౌడ్ శనివారం గుండెపోటుతో హైదరాబాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతిపట్ల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు, రైతు సంఘం జిల్లా నాయకులు నాగలి నర్సయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు కిషన్, బీసీ సంఘం జిల్లా నాయకులు యాటకారి సాయన్న, మొయినుద్దీన్ ఆదివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

మాజీ మంత్రిని కలిసిన బోథ్ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-తలమడుగు

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుకూరి రామచంద్రారెడ్డిని ఆదివారం బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తొడసం దౌలత్‌రావ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని, ప్రజల్లోకి మేనిఫెస్టో తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కష్టపడ్డ వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని దౌలత్‌రావును అడిగి తెలుసుకున్నారు. కష్టపడ్డ వారికి టికెట్ వచ్చేలా చూస్తానని అన్నారు.

నేడు ఆర్జీయూకేటీకి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటి యూనివర్సిటీకి ఎంపికైన విద్యార్థుల జాబితాను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ విడుదల చేయనున్నట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

వాటర్ ప్లాంట్ కోసం భూమిపూజ

నవతెలంగాణ-బేల



మండలంలోని టాక్లి గ్రామంలో ఆదివారం పాయల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మెన్ పాయల శరత్ తన సొంత డబ్బులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. గ్రామస్తులకు స్వచ్ఛమైన నీటిని అందించడానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామస్తులు పాయల్ ఫౌండేషన్ చైర్మెన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కం, సందీప్ రాక్రే, ప్రదీప్ ఖోడే, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓగా చాహత్ బాజ్ పాయ్

నవతెలంగాణ-ఉట్నూర్



ఉట్నూర్ ఐటీడీఏ పీఓగా చాహత్ బాజ్ పాయ్ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు పీఓగా పని చేసిన వరుణ్‌రెడ్డి ఫిబ్రవరి 1న నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. అప్పటి నుండి ఐటీడీఏ పీఓగా ఇన్‌ఛార్జిగా వరుణ్‌రెడ్డి కొనసాగారు. కొన్ని నెలల తర్వాత పూర్తి స్థాయిలో అసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చాహత్ బాజ్ పాయ్ బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేడో, రేపో పీఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

పోడు పట్టాదారులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-పెంబి

కొత్తగా పోడు పట్టాలు పొందిన రైతులు అందరూ రైతుబంధు కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం ఇటిక్యాల వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ తెలిపారు. రైతుబంధు దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు ఈ నెల 3న ముగియనున్నట్లు తెలిపారు. ఆదివారం వేంకం పోచంపాడులో పోడు పట్టాదారు రైతులకు రైతుబంధు పంటల పెట్టుబడి పథకంపై అవగాహన కల్పించారు. ఇంకా క్లస్టర్ పరిధిలో సుమారుగా 110 మంది రైతులు రైతుబంధు కొరకు దరఖాస్తు చేసుకోలేదని, సోమవారం సాయంత్రం 5 గంటలలోగా పెంబి వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-కడెం

మండలంలోని నర్సాపూర్ గ్రామం నుంచి లింగాపూర్ గ్రామం వరకు రూ.2కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపడుతామని అన్నారు. ఇంక కొన్ని గ్రామాలకు కేంద్రం అటవీశాఖ అనుమతులు మంజూరు చేయలేదని అన్నారు. సీఎం కేసీఆర్ గిరిజనులకు ప్రత్యేక అభివృద్ధి పంథాలో నడిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కడెం మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, నిర్మల్ జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫీక్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, లింగాపూర్ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, కడెం మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఐటీడీఏ పీఓకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల నూతనంగా ఐటీడీఏ పీఓగా నియామకం అయిన చాహత్ వాజ్ పాయ్‌కు ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో పాటు మండలంలోని ఆదివాసీ నాయకులు ఆదివారం ఉట్నూర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆదివాసీ గ్రామంలో నెల కొన్ని ఉన్న వివిధ సమస్యలపై వివరించారు. విద్య వైద్యం గిరీ వికాసం, రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా లాంటి తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. పీఓను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారి వెంట గాదిగూడ వైస్ ఎంపీపీ యోగేష్, ఆత్రం శంకర్, బాలాంపూర్ సర్పంచ్ పరమేశ్వర్ ఉన్నారు.

పోచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయానికి ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బూస నర్సమ్మ భోజన్న, భోజమ్మ గంగాధర్ ఇరువురు దంపతులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అబివృద్ధికోసం విరాళంగా రూ.20 వేలు నగదును ఆలయ ఛైర్మెన్ అయిటి చందుకు అందజేయగా వారిని ఆలయ చైర్మెన్ చందు శాలువా కప్పి సత్కరించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-నేరడిగొండ

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఆదివారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నాటి నుంచి గ్రామపంచాయతీ కార్మికులు 11వ పీఆర్సీని వర్తింపజేయాలని అన్నారు. పంచాయతీ కార్మికులు పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు నిర్వహణకు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మెమో నెంబర్ 48ని తీసుకువచ్చి పాఠశాలలను ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు పని వారిని వేసిందని అన్నారు. వేతనాలను చెల్లించడంలో ఇతర సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపలేదని అన్నారు. జీఓ నెంబర్ 51 తీసుకువచ్చి కార్మికుల పని భద్రతను దూరం చేసి మల్టీపర్పస్ వర్కర్స్‌గా మార్చివేసి పని భారాన్ని పెంచిందని అన్నారు. కార్మికులకు రూ.2లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని సీఎం హామీనిచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. వచ్చే వేతనాలు కుటుంబ పోషణకు సరిపోక గ్రామపంచాయతీ కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు చెల్లించాలని 60 సంవత్సరాలు నిండిన వారికి ఐదు లక్షల రూపాయల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇస్తూ వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. కార్మిక సంఘాలను కలుపుకొని జూలై 6వ తేదీ నుంచి గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తారని తెలియజేశారు. ఈలోపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కారం కోసం చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొజ్జ ఆశన్న, నేరడిగొండ మండల అధ్యక్ష, కార్యదర్శులు పోశెట్టి, రాజేశ్వర్, మండల నాయకులు అశోక్, నాందేవ్, రాజు, హరిప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జనాభా ప్రాతిపదికన సీట్లు ఇవ్వాలని చలకాని వెంకట్ యాదవ్ అన్నారు. యాదవ్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాదవ కుల సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల హక్కుల కోసం అభ్యున్నతి కాంక్షిస్తూ, జనాభా దామాషా ప్రకారం ఓటు బ్యాంకుగానే పరిమితం కాకుండా, అన్ని రాజకీయ పార్టీలు యాదవ జనాభా ప్రతిపాదికన సీట్లు ఇవ్వాలని తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని అన్నారు. సమాజంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న అన్యాయాల్ని అజమాయిషిని ఎదుర్కోవాలని అందుకు న్యాయవ్యవస్థను తగిన విధంగా ఉపయోగించుకొని ఎదురించాలని అన్నారు. అన్ని యాదవ కుల సంఘాలు రాజకీయ పార్టీల సీట్ల సాధన దిశగా పనిచేయాలని అన్నారు. యాదవ హక్కుల సాధనకై ఆగస్టు 13న సరూర్‌నగర్ మైదానంలో లక్షలాది మందితో బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 కుల సంఘాలు పాల్గొననున్నాయి. ఆగస్టులో జరగబోయే బహిరంగ సభకు అన్ని కుల సంఘాల మద్దతు తెలిపాయి. ఈ సమావేశంలో వర్రే వెంకటేశ్వర్లు యాదవ్, ఆర్ లక్ష్మణ్ యాదవ్, చింతల రవీందర్ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, కరాటే కళ్యాణి యాదవ్, శెట్టి వంశీ మోహన్ యాదవ్, దాసరి నాగేష్ యాదవ్, మేకల లలిత యాదవ్, బొబ్బల గోపాలకృష్ణ యాదవ్, అబ్బు శ్రీనివాస్ యాదవ్, రాగం సతీష్ యాదవ్, బేరి రామచందర్ యాదవ్‌గౌతమ్ యాదవ్, ఓరుగంటి వెంకటేశ్ యాదవ్, వెంకన్న యాదవ్, మంజుల యాదవ్, దాసరి శ్రీనివాస్ యాదవ్, సాదం బాలరాజు యాదవ్, బీణవేణి మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

అబివృద్ధే మా లక్ష్యం : ఎమ్మెల్యే బాపురావు

నవతెలంగాణ-తలమడుగు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధివైపు దూసుకుపోతోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. ఆదివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అన్నారు. దేవాపూర్ గ్రామంలో శబరిమాత ఆలయ షెడ్డుతో పాటు గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు గాను తన నిధుల నుండి రూ.12లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. పోరాడి సాధించిన తెలంగాణలో సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఉద్యేశంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో తెలంగాణ ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదగాలని సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో దేవాపూర్ గ్రామ సర్పంచ్ ఫాతిమాబేగం, మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, ఝరి పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, రైతుబంధు నాయకుడు గోక జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్లా, మహేష్, సంతోష్, నారాయణ, మగ్గిడి ప్రకాష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సవారి బంగ్లా నిర్మాణానికి భూమిపూజ

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కులమతాలకు అతీతంగా పీరీల పండుగ ఎంతో వైభవంగా నిర్వహించుకోవడం జరుగుతుందని, సవారి బంగ్లాల నిర్మాణానికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద(టి) గ్రామంలో సవారి బంగ్లా నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పీరీల పండుగను నిర్వహించుకుంటారని, సవారి బంగ్లా వద్ద సౌకర్యాలు కల్పించేలా తన వంతుగా పూర్తి కృషి చేస్తానని అన్నారు. మొహరం లోపు ఇక్కడ షెడ్డు నిర్మాణం అయ్యేల చూస్తానని భరోసా ఇచ్చారు. అదే విధంగా గ్రామంలో డబుల్ రోడ్డు కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ గ్రామాలను అభివృద్ధివైపు తీసుకెళ్లాలని అన్నారు. అంబేద్కర్ విగ్రహం ఇప్పిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, మార్కెట్ చైర్మెన్ విజయలక్ష్మి రాజు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రమేష్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, ఆత్మ చైర్మెన్ జిట్ట రమేష్, బీఆర్ఎస్ నాయకులు సేవ్వ జగదీష్ యాదవ్, ఆరె నరేష్, పీఏసీఎస్ చైర్మెన్ కిరణ్, ఉపసర్పంచ్ సుదర్శన్, మాజీ సర్పంచ్ అడెల్లు, దేవస్థానం నిర్వాహకులు శ్రీనివాస్, రాజేష్, శివకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఎస్ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, న్యాయం చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారు. పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరూ ఏకతాటిపైకి వచ్చి ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. 2003 కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు సాధించామని, కానీ 2004 తర్వాత తమకు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వడంతో కొత్త పింఛన్ పరిధిలోకి రావడం జరిగిందన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోయే అవకాశముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి 2004లో అపాయింట్‌మెంట్ అయిన ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

పట్ట పగలే చోరీ

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఆదివారం పట్టపగలే దొంగలు తాళం పగలకొట్టి చోరీకి పాల్పడటం కలకలం రేపింది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్న రాజమణి బంధువులతో కలిసి మార్కెట్‌కు వెళ్లి మధ్యాహ్నం వచ్చే సరికి ఇళ్ల తాళం పగలకొట్టి ఉందన్నారు. సుమారు తులం బంగారం చోరీకి గురైనట్టు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక పెద్దర్ల గుట్ట ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధి చేపట్టాలని కోరగా దానికి ఎమ్మెల్యే స్పందించి, ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అలాగే హనుమాన్ ఆలయ పూజారి విలాస్ జోషిని ధూపదీప నైవేద్య పథకం కింద చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మాణ్‌సింగ్, వైస్ ఎంపీపీ లింబాజీ, సొసైటీ డైరెక్టర్ లోలపు పోశెట్టి, కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు రమేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు సోమ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : డీటీఎఫ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, బదిలీలు పదోన్నతులు చేపట్టాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సామ్యూల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో డీటీఎఫ్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ నూతన పీఆర్సీని, ఐఆర్‌ను ప్రకటించాలని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం విద్యారంగంలో కాషాయికరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వృక్రోధర్ పాల్గొన్నారు.

మొహరం పండుగలో ఐక్యతకు నిదర్శనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐక్యమత్యాన్ని చాటి చెప్పే పండుగల్లో మొహరం పండగ ఎంతో విశిష్టత కలిగిన పండుగ అని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. ఆదివారం బొక్కలగూడలోని బడే సాహజరత్, బడే నాల్సబ్ బంగ్లాలో 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరై నిర్వాహకులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం వారు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కులు చెల్లించుకోవడం మన ఆచారమని అన్నారు. మతాలు వేరైన సవారి వద్ద ప్రతి ఒక్కరూ మొక్కలు చెల్లించుకోవడం ఆనావాయితీగా వస్తుందన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రూ.6కోట్లతో సవారి బంగ్ల షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మతసామరాస్యకు బీఆర్ఎస్ పార్టీ పెద్దపీట వేస్తూ అన్ని కులాలు మతాలకు సంబంధించిన ఆలయాలను నిర్మిస్తూ వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. శాంతి స్థాపనకు బాటలు వేస్తూ ముందుకు పోతున్నామని అన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్, నాయకులు సాజిదోద్దీన్, స్వరూప రాణి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు ప్రభుత్వం పెద్ద పీట



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నూతన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అంజి, హర్కపూర్ తండాలకు మంజూరైన నూతన పంచాయతీ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఐదు వందల జనాభా గల తండాలకు, గుడెలకు పంచాయతీలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ పంచాయతీలకు ప్రస్తుతం నూతన భవనాలు సైతం మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఏమాయికుంట గ్రామంలో సురేష్ మహారాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన గోశాలను ప్రారంభించారు. పిట్టబొంగరం గ్రామంలో ప్రజలతో ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆనందించు జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

సోమవారం 03 జులై 2023

అదనపు కలెక్టర్ బదిలీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విధులు నిర్వహిస్తున్న చాహత్ బాజ్‌పాయిని ఐడీటీఏ ఉట్నూర్ పీఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యనిర్వహణ అధికారిని శాంతి కుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటివరకు ఐటీడీఏ పీఓగా అదనపు బాధ్యతలు వరుణ్‌రెడ్డి నుండి బాధ్యతలు స్వీకరించింది. వరుణ్ రెడ్డి గతంలో ఆసిఫాబాద్‌లో అదనపు కలెక్టర్‌గా పనిచేసి బదిలీ కాగా ఆయన స్థానంలో అదనపు కలెక్టర్‌గా చాహత్ బాజ్‌పాయి బాధ్యతలు స్వీకరించగా మళ్లీ ఐటీడీఏ పీఓగా కూడా అదే విధంగా బాధ్యతలు స్వీకరించింది.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



బదిలీపై వెళ్తున్న పట్టణ రెండవ ఎస్సై ఎండి ఫరిద్‌కు ఆదివారం క్యాతనపల్లి ప్రెస్‌క్లబ్‌లో, పట్టణ ఎస్సై బి.అశోక్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో శాలువాతో సత్కరించారు. ఈయన రామగుండం పట్టణ రెండవ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై బి.అశోక్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కలువల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ రిత్యా పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘకాలంగా విశేష సేవలు అందించి తోటి ఉద్యోగులకు ఆదర్శంగా ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామిల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తూముల భవిష్యత్, కోశాధికారి పరికిపండ్ల రాజు, సంయుక్త కార్యదర్శి పొలుదాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధరాఘాతం..!

- కొండెక్కిన కూరగాయల ధరలు
- ధరల ధాటికి జనం విలవిల
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నవతెలంగాణ-కెరమెరి

కూరగాయలు కొనాలనంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. పచ్చి మిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది. టమోటా, కూరగాయల సాగు తగ్గిందని ధరలు పెరిగాయి అంటూ సామాన్యులను దోపిడికి గురి చేస్తున్నారు. గతంలో కిలో టమాట ధర రూ.80 ఉండగా ఏకంగా రూ. 150కి చేరింది. నిత్యం వంటకాల్లో టమోటా అవసరం కాబట్టి ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేస్తున్నారు.

పెంరిగిన కూరగాయల ధరలు

వంకాయలు గతంలో కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం.రూ.80 ఉంది. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.15 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.50కి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీధి దుకాణాల్లో కిలో రూ.50 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. ఇక పచ్చిమిరపకాయల మాట ఎత్తుకుంటే కిలో రూ.160 చొప్పున అమ్ముతున్నారు. ఇదేమిటి అంటే ఈసారి పంట తక్కువగా ఉందని, గిరాకీ బాగా పెరిగిందని దుకాణదారులు చెప్పడం గమనార్హం. ఇక ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాటి ధరలు సైతం ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతంగా పెరిగాయి. ఏ ఆకు కూర కట్ట తీసుకున్నా రూ.10 ఉంది. ముఖ్యంగా మెంతి ఆకు, పాలకుకూర వంటి వాటిని సైతం అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

కూరగాయల ధరలు ఇలా

చిక్కుడు	-200
టమాటా	-140
వంకాయ	- 80
కాకర	-160
బెండకాయ	- 60
అలసంద	- 40
తోటకూర	- 80
ఎల్లి పాయ	- 180
ఉల్లిపాయ	- 50
అల్లం	-120
సొరకాయ	- 60
బీరకాయ	- 80
మునగ.	- 80



ఇక ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో విఫలమైయ్యారని ప్రజలు భావిస్తున్నారు. మార్కెట్‌లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోతున్న వినియోగ దారులు

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ విపరీతంగా రేట్లను పెంచడంతో రవాణా ద్వారా ట్రాన్స్‌పోర్టు ద్వారా నిత్యావసర, కూరగాయలు రేట్లు అధికమయ్యాయి. దీని వల్ల రైతుల కంటే దళారులు ఎక్కువ ఫలితం పొందుతున్నారు. రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారు.

ధరలను నియంత్రించాలి

చిలుముల శాంత వ్యవసాయ కూలీ, వాంకిడి

కూలీ, నాలి చేసుకొని బ్రతుకుతున్నాం. రోజూ కూలీ పని చేస్తే తప్ప పూట గడవని దుస్థితి. కూరగాయల ధరలేమో మండిపోతున్నాయి. కూరగాయలు కొని తినలేని పరిస్థితి. గత కొన్ని నెలలుగా ధరలు పెరుగుతున్నాయి. దీంతో పేద ప్రజలకు కష్టంగా మారింది. ప్రతి రోజు చేసే వంటకాల్లో టమాటా అవసరం. కానీ పెరిగిన ధరలతో వారానికి ఒక్క రోజు కూరగాయలు తినాల్సి వస్తుంది. ప్రభుత్వం పెరిగిన ధరలను నియంత్రించాలి.

ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండాలి

పెందూర్ రాజేశ్వర్, గిరిజన సంఘం నాయకుడు జోడేఘాట్



రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి. సామాన్య ప్రజలకు ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు పనులు దొరక్క చేతుల్లో చిల్లి గవ్వ లేక ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణంలో కూరగాయల ధరలు పేద ప్రజలను ఊపిరి అడకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ధరలు తగించేందుకు కృషి చేయాలి. నిత్యావసర ధరలతో పాటు కూరగాయల ధరలు తగ్గిస్తే పేదలకు భారం తగ్గుతుంది.

మహేంద్ర కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-జన్నారం

మహేంద్ర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని దీనికి ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని మహేంద్ర సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఎమ్మార్ నర్సింగరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సంఘ భవనంలో మండల మహేంద్ర సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీకి నియమితులైన నర్సింగరావును సంఘ భవనంలో మండల మహేంద్ర సంఘం నాయకులు, శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో తన కులానికి అవకాశం కల్పించే విధంగా ఎమ్మెల్యేతో పాటు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ నెల 9వ తేదీన వీర్లగుట్టల దగ్గర ఉన్న నల్ల పోచమ్మ బోనాల వేడుకలను జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ బోనాల కార్యక్రమంలో మహేంద్రు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా మండల నాయకులు సూరినేని కొండయ్య, చిలివేరి నర్సయ్య, కోడి జుట్టు రాజన్న, పిల్లి మల్లయ్య, పర్ల కనకయ్య, ఒడిపెల్లి రాములు, సంద గోపాల్, సందకృష్ణ, చిలివేరి సుధీర్ కుమార్, నగురు నరేష్, శనిగరపు వెంకటేష్ పాల్గొన్నారు.


బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా గంగారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బి.గంగారెడ్డి నియమితులయ్యారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని రంగారెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ వైర్లు బిగించి రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బాదంపెల్లి గ్రామంలో గత నెల 21వ తేదీన ఈదురుగాలులకు గ్రామం శివారులో ఉన్న ఎల్లమ్మ గుడి సమీపాన మూడు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా నేల కోరిగాయి. అప్పటినుంచి ఆ గ్రామ రైతులు, శ్రీనివాస్, సత్తన్న, శంకరయ్య, లచ్చన్న, మల్లయ్య, తదితర రైతులు ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్ లైను లేక వరి నార్లు వేసుకోలేకపోతున్నామని తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభాలకు వైర్లు సరిచేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను యదావిదిగా అందుబాటులోకి తెచ్చి ఆదుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. లేకుంటే విద్యుత్ కార్యాలయం ముందు రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఆదివాసీ గ్రామంలో ఘనంగా అకాడి పండుగ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసులు మొదటి పండుగ అయిన ఆకాడి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం బాబేఝరి గ్రామంలో ఆదివాసులు ఆకాడి పండుగను నిర్వహించారు. గ్రామంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో మడావి లింగు పటేల్, పెందోర్ జంగూ, జలపత్ రావ్, మడావి సాగర్, తెలంగ్‌రావ్ పాల్గొన్నారు.

'ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వస్తున్నా'

- టీజీఓ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంకా 8 సంవత్సరాల సర్వీస్ ఉన్నప్పటికీ పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా స్వచ్ఛంద పదవి విరమణ తీసుకొని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నానని గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్ అన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన నేపథ్యంలో శ్యాంనాయక్ సేన ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరుకున్నానని తెలిపారు. చదువుతోనే అన్ని సాధ్యమవుతాయని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారని దాన్ని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. తాను 2003 నుండి జిల్లాలో ఉద్యోగం చేస్తున్నానని జిల్లా ప్రజలు 2009లో తన భార్య రేఖానాయక్ ఎమ్మెల్యేగా నిలబడితే ఓట్లు వేశారని మూడో స్థానం ఇచ్చారని గుర్తు చేశారు. తర్వాత వచ్చిన ఎన్నికల్లో జడ్పీటీసీగా అతిపెద్ద మెజార్టీతో గెలిపించారని తన భార్య రాజకీయ ఆరంగేట్రం ఆసిఫాబాద్ కేంద్రంగా జరిగిందని ఆసిఫాబాద్‌ను తాను ఎప్పటికీ మర్చిపోలేనని అన్నారు. ఆమె బాటలో తాను నడుస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఆశీర్వదిస్తే పేదల పాలిట పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. అనంతరం శ్యాంనాయక్ సేన ఆధ్వర్యంలో గజమాలతో సన్మానించగా, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన జడ్పీటీసీ సంతోష్, వివిధ సంఘాల నాయకులు అర్జు మాస్టర్, రేగుంట కేశవ్, సొల్లు లక్ష్మి, బద్రి సత్యనారాయణ, ఎన్‌జీఓ జిల్లా నాయకులు రాజశేఖర్, పృథ్వి, బీసీ సంఘం నాయకులు రూప్నర్ రమేష్, మధు, శ్రీనివాస్, డీటీఓ కార్యాలయ ఏఓ అరుణ భాయి, యూటీఎఫ్ నాయకులు హేమంత్ షిండే, ఉషన్న పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చే సత్తా బీజేపీకే ఉంది'

- అవినీతితో దేశ ప్రతిష్టను మంట గలిపింది కాంగ్రెస్
- బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణలో అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితికి వీఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించే సత్తా కేవలం బీజేపీకే ఉందని బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మురళీధర్‌రావు అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్‌లో మహాజన సంపర్క్ అభియాన్ బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మురళీధర్‌రావు మాట్లాడుతూ కుటంబపాలన కొనసాగించే బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీనే అధికారంలో ఉంటే డబుల్ ఇంజన్‌తో దేశాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడి ప్రపంచంలోనే భారతదేశాన్ని అవినీతిమయ దేశంగా మార్చారని అన్నారు. ఇపుడు అదే దేశానికి ప్రధానిగా మోడీ ప్రపంచదేశాలకు వెళ్లి అక్కడి ప్రజల మన్ననలు అందుకుంటున్నారని అన్నారు. నేడు అన్ని రాష్ట్రాలలో కుటుంబపాలన కొనసాగుతోందనీ, కుటుంబపాలన లేని ఏకైక పార్టీ బీజేపీనేనని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సిర్పూరు నియోజకవర్గానికి పట్టిన గ్రహణమని అన్నారు. ఆ గ్రహణాన్ని వచ్చే ఎన్నికలలో బీజేపీతో తొలగించుకోవాలని సూచించారు. ఈ నియోజకవర్గంలో ప్రజలలో ఉండాల్సిన వైద్యులు జైళ్లలో, జైళ్లలో ఉండాల్సిన దొంగలు ప్రజలలో ఉంటున్నారని పరోక్షంగా డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పోడు భూముల పక్షాన పోరాడి జైలుకెళ్లిన ఉదంతాన్ని ప్రస్తావించారు. దీనికి ముందు పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తదితరులు మాట్లాడారు. సమావేశానికి ముందు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా వచ్చిన మురళీధర్‌రావును పార్టీ నాయకులు సన్మానించారు. సిర్పూరు తాలూకా కన్వీనర్ వీరభద్రచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, శ్రీరాంగౌడ్, మోనీ, నాయకులు దోని శ్రీశైలం, ఆత్మారాం నాయక్, గోలెం వెంకటేష్, వాను పటేల్, చప్పిడి సత్యనారాయణ, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు పూర్ణచందర్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని మారుమూల దొంగపల్లి, మల్యాల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ఆదివాసీల అభివృద్ధి కొరకు కట్టుబడి ఉన్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలోని గిరిజనులకు పోడు చేసుకొని సాగు చేసుకుంటున్నా భూములకు పట్టాలు ఇచ్చామన్నారు. ఆదివాసీ గిరిజనులు అంతా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి బాసటగా నిలవాలన్నారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆదివాసి గిరిజనులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజనులు పూర్ణ యువసేన సభ్యులు శ్రీనివాస్ నాయక్, ఉప్పు శ్రీను, నరేష్, సృజన్, ఇలియాస్, సత్యం, మహేందర్, వెంకటేష్ తిరుపతి పాల్గొన్నారు.

హైదరాబాద్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 9న హైదరాబాద్‌లో నేషనల్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు సొసైటీ జిల్లా అధ్యక్షుడు మాదం గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉన్నారు.

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

నవతెలంగాణ-జన్నారం



దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని దళిత సేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు ఆదివారం మండల కేంద్రంలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావన్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరపడాన్న తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతనిపై కాల్పులు జరిపిన దుండగులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. దళితుల అభివృద్ధి కోసం పాటుపడుతున్న చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌కు దళితులంతా బాసటగా నిలవాలన్నారు. దళితులపై దాడులు జరుగుతే వెంటనే ప్రభుత్వాలు స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బోనాల పండుగ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చాంద(టి), జందాపూర్, అనుకుంట, తంతోలి, అంకోలి, ఆయా గ్రామాల్లో ప్రజలు పోచమ్మ, మైసమ్మ, దేవతలకు ప్రత్యేక పూజలు చేసి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా వరుణ దేవుడు కరుణించి, వర్షాలు కురువాలని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

పూసల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముద్రకోల రవి, ఉపాధ్యక్షులు ముద్రకొల రాజన్న, కోశాధికారి నాగిశెట్టి రవి, ప్రధాన కార్యదర్శి ముద్రకొల్ల సత్తన్న, కార్యదర్శి నాగిశెట్టి చిన్నన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన, మండల అధ్యక్షులు ముద్రకుల రవి మాట్లాడుతూ మండల అధ్యక్షులుగా ఎన్నుకున్న పూసల కులస్తులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పూసల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. పూసల కుల హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. పూసల కులస్తులంతా తమకు సహకరించాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న పూసల సంఘం కమిటీ సభ్యులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.